నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
ఆదివారం, తెలంగాణ
06 జులై 2025

నూతన తహసీల్దార్‌గా శ్రీనివాస్ యాదవ్

ఆళ్లపల్లి, జూలై 5 నినాదం న్యూస్ : ఆళ్లపల్లి నూతన తాసిల్దార్ గా శ్రీనివాస్ యాదవ్ శనివారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆయన బదిలీల్లో భాగంగా మరొక చోటు నుంచి ఆళ్లపల్లి మండలంకు వచ్చారు. నెల రోజుల క్రితం విధులు నిర్వహించిన తాసిల్దార్ రాఘవరెడ్డి మైబాద్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన తాసిల్దార్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలపై రెవెన్యూ కి సంబంధించిన సర్టిఫికెట్స్ విషయంలో నిరంతరం మా వంతు కృషి చేస్తామని మండల ప్రజలకు తెలిపారు.

కేసీఆర్ నాయకత్వం మాకు, ప్రజలకు శ్రీరామరక్ష

- కేసీఆర్‌ను కలిసిన మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు

వనపర్తి ప్రతినిధి, జూన్ 5 (నినాదం న్యూస్): తెలంగాణ రాష్ట్ర సాధకులు, అభివృద్ధి ప్రదాత, మార్గదర్శకులు కేసీఆర్ నాయకత్వం మాకు, ప్రజలకు శ్రీరామరక్ష అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఏం.ఎల్.సి నవీన్ రెడ్డి,మాజీ ఎం.ఎల్.ఏలు రావుల చంద్రశేఖర్ రెడ్డి, జైపాల్ యాదవ్,గువ్వల బాలరాజు లు నందినగర్ నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కేసీఆర్ ఆరోగ్య, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కొద్దిసేపు భేటీ అయిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి బృందంతో కేసీఆర్ పార్టీ నిర్మాణం, రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సమస్యలు, జిల్లాలో పార్టీ బలోపేతం గురించి చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ ఎంతో ఉపయోగమని అన్నారు. ప్రజలు ఆయన పాలన కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు.

మైనర్లు మోటార్ వెహికిల్స్ నడపడం చట్టరీత్యా నేరం

- అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రఘు

వనపర్తి ప్రతినిధి, జూలై 5 (నినాదం న్యూస్): మోటార్ వెహికల్ యాక్సిడెంట్ చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు బాల బాలికలు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, న్యాయవాది ఎం.రఘు అన్నారు. ఈ చట్ట ప్రకారం ఎవరైనా వాహనాలు నడిపితే రూ.25 వేలు జరిమానా, మూడు సంవత్సరాల జైలు శిక్ష తల్లిదండ్రులకు విధించబడుతుందని చెప్పారు.జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆదేశాల మేరకు శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మాస్టర్ మైండ్స్ పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల చట్టం, సైబర్ క్రైమ్స్ పై విద్యార్థులకు వివరించారు. ఉచిత న్యాయ సలహాల కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌతమ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బడేపై ప్రచారాల్లో వాస్తవం లేదు...

- లేఖకు మావో పార్టీతో సంబంధం లేదు
- మావో అధికార ప్రతినిధి జగన్ పేరిట లేఖ

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం): మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే దామోదర్ అలియాస్ చొక్కారావుపై జరుగుతున్న ప్రచారాల్లో ఎలాంటి వాస్తవాలు లేవని ఆ పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరిట లేఖను విడుదల చేశారు.బడే దామోదర్‌పై గతంలోనూ దుష్ప్రచారాలు చేశారని, మళ్లీ ఇటీవల లొంగిపోతున్నట్లు జరిగిన ప్రచారం నిజం కాదని బడే దామోదర్ లొంగుబాటుపై క్లారిటీ ఇచ్చింది. ఇటీవలి కాలంలో జరిగిన ఎన్ కౌంటర్ లలో బడే దామోదర్ మృతి చెందారంటూ ప్రచారం జరిగిందని, మళ్లీ లొంగిపోతున్నట్లు ప్రచారం చేసి ప్రజల్లో గందరగోళం సృష్టించ ప్రయత్నాలు చేశారని తెలిపారు. జూన్ 25న మావోయిస్టు పార్టీ పేరిట రాష్ట్ర మంత్రి సీతక్కపై ఆరోపణలు చేస్తూ విడుదలైన లేఖకు తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్ ను తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని, ఎన్ కౌంటర్లు ఆపాలని డిమాండ్ చేస్తోందని లేఖలో పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీని నిర్మూలించడం సరైన చర్య కాదని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో తమ పార్టీ సీతక్కపై ఆరోపణలు చేసే అవకాశం లేదని, ఆ లేఖకు మావోయిస్టు పార్టీకి సంబంధం లేదని జగన్ పేరిట విడుదలైన లేఖలో స్పష్టం చేశారు.

మంత్రి సీతక్కకు వచ్చిన మావోల లేఖ ఫేక్

వరంగల్, జూలై5(నినాదం న్యూస్): మంత్రి సీతక్కకు వార్నింగ్ ఇస్తూ వారం క్రితం మావోయిస్టులు విడుదల చేసిన లేఖ ఫేక్ అని తేలింది. ఇలాంటి లేఖ ఏదీ తాము రాయలేదని ఇప్పుడు మావో అధికార ప్రతినిధి పేరుతో ఓ లేఖ విడుదలయ్యింది. ఆ లేఖ మేం రాయలేదంటూ మరో లేఖ విడుదల చేయడంతో ఫేక లేఖ ఎవరిదన్నది ఇప్పుడు బయటపడాల్సి ఉంది. మంత్రి సీతక్కను హెచ్చరిస్తూ మావోయిస్టులు రిలీజ్ చేసిన లేఖపై మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ క్లారిటీ- ఇచ్చారు. ఈ మేరకు ఒక అధికారిక పత్రికా ప్రకటన విడుదల చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ- పేరుతో 26.06.2025న మంత్రి సీతక్కపై వచ్చిన తాము రాయలేదని.. మా పార్టీకీ, ఆ లేఖకు ఎలాంటి సంబంధం లేదని తాజా లేఖలో స్పష్టం చేశారు. అలాగే మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావ్ అలియాస్ లొంగుబాటులో వాస్తవం లేదని తెలిపారు.

పెంపుడు జంతువులతో జాగ్రత్త

- మనుషులకు వ్యాధులు సంక్రమించే ప్రమాదం
- కుక్కకాటుకు గురైనప్పుడు రేబిస్ వచ్చే అవకాశం
- సకాలంలో యాంటీరేబిస్ వ్యాక్సిన్ ఇప్పించడం తప్పనిసరి
- నేడు జూనోసిస్‌డే సందర్భంగా పెంపుడు కుక్కలకు టీకాలు

కోదాడ(నినాదం): పెంపుడు జంతువులైన కుక్కలు, పిల్లులు (పెట్స్)తో అనేక రకాల వ్యాధులు సక్రమించే ప్రమాదం పొంచి ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. కుక్కలు, పిల్లులను పెంచుకునే యజమానులు వాటి ఆరోగ్యంపై ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. సరైన సమయంలో టీకాలు వేయించకపోయినా వాటికి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశముంది. వీటి ద్వారా మనుషులకూ సోకే ప్రమాదముంది. జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం జిల్లాలో అన్ని వెటర్నరీ సబ్ సెంటర్లలో పెంపుడు జంతువులైన పిల్లులు, కుక్కలకు పశువై ద్యాధికారులు ఉచిత యాంటీరేబిస్ టీకాలు వేయ్యనున్నారు .ఈ అవకాశాన్ని పెంపుడు జంతువులు సాదుకునే వారు వినియోగించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

2వేలకు పైగా పెంపుడు కుక్కలు...

జిల్లా కేంద్రంతో పాటు హుజూర్నగర్, కోదాడ, తుంగతుర్తి, తిరుమలగిరి పట్టణాలతో పాటు వివిధ మండల కేంద్రాలు, గ్రామాల్లో సుమారు 2వేలకు పైగా పెంపుడు కుక్కలను కొందరు పెం చుకుంటున్నారు. అలాగే 500 వరకు పిల్లులను సైతం పెంచే వారు కూడా ఉన్నారు. అయితే వీటి తో పాటు జిల్లాలో 15వేలకు పైగా వీధికుక్కలు ఉన్నట్టు అంచనా. ఇవి గాయం చేస్తే వెంటనే వైద్యులను సంప్రదించి టీకాలు వేయించుకుంటే మంచిదని వైద్యాధికారులు చెబుతున్నారు. ఇళ్ల లో కుక్కలను పెంచుకునే వారు కూడా జాగ్రత్త గా ఉండాలంటున్నారు.

సన్నిహితంగా ఉండేవారికి ముప్పు

జూనోటిక్ వ్యాధులు పశువులు, జంతువులతో సన్నిహితంగా ఉండే వారికి త్వరగా సోకుతాయి. కుక్కలతో సన్నిహితంగా ఉండే వారికి రేబిస్, హైడ్రాటియోసిస్, కొమ్ములు, చర్మం, ఎముకలతో సంబంధం ఉండే పరిశ్రమల్లో పనిచేసే వారికి, కటిక పని చేసేవారికి దొమ్మ వ్యాధి, డెయిరీ ఫారాల్లో పని చేసే వారికి, పశువైద్యులకు బ్రూసెల్లోసిస్, కోళ్ల ఫారాల్లో పనిచేసే వారికి సిట్టకోసిస్, ధాన్యం గిడ్డంగుల్లో పనిచేసే వారికి లెప్టోస్పైరోసిస్, కలుషితమైన పాలు తాగే వారికి క్షయ వ్యాధి వ్యాపించే ప్రమాదం ఉంది. సుమారు 200కు పైగా జూనోటిక్ వ్యాధులు ఉన్నప్పటికీ ప్రాణాంతమైనవి కావు. రేబిస్, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్ మాత్రం ప్రమాదకరమైనవే.

వ్యాక్సిన్ వేయించాలి..

- అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య, ఏరియా వెటర్నరీ హాస్పిటల్, కోదాడ

నేటి ఆధునిక కాలంలో మూగజీవాలపై అమిత మైన ప్రేమను కనబరుస్తున్నారు. పెంపుడు జంతువులు సాదుకునేందుకు చాలా మంది ఇష్టపడుతున్నారు. కుక్కలు, పిల్లలు సాకేవారు వాటికి సకాలంలో వ్యాక్సిన్లు వేయించాలి. యాంటీరేబిస్ వ్యాక్సిన్ వేయించడం ద్వారా మనుషులకు రేబిస్ వ్యాధి సోకదు.జంతు ప్రేమికులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. పెంపుడు జంతువులతో ఆడుకున్నా, వాటిని ఎత్తుకున్నా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. పెంపుడు జంతువులకునాణ్యమైన ఆహారం అందజేయడం, పరిశుభ్రమైన స్థలంలో నివాసం ఏర్పాటు చేయాలి.జూనోటిక్ వ్యాధులు, వాటి నివారణపై అవగాహన పెంచుకోవడం ద్వారా ముందస్తుగా వాటి వ్యాప్తిని అరికట్టవచ్చు.

సంక్రమించే వ్యాధులు...

పిచ్చికుక్క కాటు ద్వారా రేబిస్, పందులపై ఉండే దోమల కాటు వల్ల మెదడువాపు వ్యాధి, బ్యాక్టీరియా ద్వారా బ్రూసెల్లోసిస్, సాల్మొనెల్లోసిస్, క్షయ, దొమ్మ వంటి వ్యాధులు, ఎలుకలపై ఉండే కీటకాల ద్వారా లెప్టోస్పైరోసిస్, పరాన్న జీవుల ద్వారా అంకైలోస్టామియాసిస్, హైడారిటీయోసిస్, గజ్జి, అమీబియాసిస్, పందుల ద్వారా గాలికుంటు వ్యాధి సంక్రమిస్తుంది. కోళ్లు, పక్షుల ద్వారా ఇన్ఫ్లూయిజా, క్లమీడియోసిస్, లిస్టీరియోసిస్, సాల్మొనెల్లోసిస్, క్షయ, తామర, సిట్టకోసిస్ లాంటి వ్యాధులు మనుషులకు సోకుతాయి.

మౌలిక వసతుల కల్పనతో సర్వతోముఖాభివృద్ధి

- ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

కుత్బుల్లాపూర్, జూలై 5 (నినాదం న్యూస్): కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 126 - జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్య నగర్ "బి", "సీ" బస్తీలలో సుమారు 47 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపుగా అభివృద్ధి చేయడమే మా బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, శశి, బాబు గౌడ్, సయ్యద్ సాజిద్, ఇందిరా గౌడ్, త్రివేణి, నాని, పాపులు గౌడ్, మజ్జి శ్రీను, జయ కృష్ణ, మనోజ్, ముంతాజ్, గిరి, బండ మహేందర్, బ్రహ్మానంద చారి, హనుమంతు, సత్యనారాయణ, గణేష్, వెంకటేష్, మహమూద్, అంజయ్య నగర్ - బి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సురేందర్, ఉపాధ్యక్షులు సోమేష్, ప్రధాన కార్యదర్శి కిరణ్, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుచ్చిబాబు, లక్ష్మారెడ్డి, వీరేశం, సంజీవరెడ్డి, సత్యనారాయణ, కృష్ణ, జంగారెడ్డి, నందకుమార్, దుర్గాప్రసాద్, రాజు, జయశ్రీ, భూలక్ష్మి, బాలలక్ష్మి, రాధా, అమరావతి, అంజయ్య నగర్ -సి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గురువయ్య, ప్రధాన కార్యదర్శి రాజు గౌడ్, ఉపాధ్యక్షులు పాండు, కోశాధికారి అశోక్ గౌడ్, కాలనీ నాయకులు నాగరాజు ముదిరాజ్, బాబురావు, అరవింద్, రాము, రమేష్, యాదగిరి, భీమయ్య, రాజశేఖర్, లాలయ్య, సుధాకర్, వెంకటయ్య, లక్ష్మి, లలిత, అంజమ్మ పాల్గొన్నారు.

యదగిరిగుట్టలో వైభవంగా గిరి ప్రదక్షిణ

- స్వాతి నక్షత్రం సందర్భంగా నిర్వహణ

యాదగిరిగుట్ట, జూలై5(నినాదం న్యూస్): తెలంగాణలో ప్రసిద్ధి చెందిన యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో శనివారం వందలాది మందిభక్తులు గిరిప్రదక్షిణం సాగించారు. నమో నారసింహా అంటూ ఉత్సాహంగా గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. శ్రీనరసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా శనివారం ఉదయం గిరి ప్రదక్షిణ జరిగింది. భక్తుల జయజయ ధ్వానాల మధ్య గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా జరిగింది. తొలుత వైకుంఠ ద్వారం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం.. కొండ చుట్టూ తిరిగారు. ప్రత్యేక ఆరాధనలో భాగంగా స్వాతి నక్షత్రం సందర్భంగా గర్భాలయంలోని మూలవరులకు అష్టోత్తర శత ఘటాభిషేకం నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా శ్రీవేంకటేశ్వర అన్నమాచార్య సేవా ట్రస్ట్ బృందం ప్రదర్శించిన భరత నాట్యం ఆకట్టుకుంది. ఆధ్యాత్మిక చింతనతో క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులకు మానసిక ఉల్లాసం అందించే లక్ష్యంగా దేవస్థానం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శనివారం కావడంతో గుట్టైన భక్తుల కోలాహలం కనిపించింది.

11 కిలోల గంజాయి పట్టివేత..

- గంజాయి విలువ సుమారుగా రూ 2.80 లక్షలు
- గంజాయి సరఫరా, అమ్మకం, వినియోగం చట్టరీత్యా నేరం
- సమాచార వనరులు ఏర్పాటు చేసుకొని సమర్ధవంతంగా పని చేస్తున్నాం
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ నరసింహ

కోదాడ(సూర్యాపేట), జూలై 5(నినాదం న్యూస్): ప్రభుత్వ ఆదేశాల మేరకు గంజాయిని రూపుమాపడం కోసం కృషి చేస్తున్నామని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ అన్నారు. ఇద్దరి యువకులు గంజాయిని దాచి అమ్మేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నట్లుగా ఎస్పీ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట ఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. కోదాడ మండలం ద్వారకుంట గ్రామానికి చెందిన అడప రాకేష్, వనపర్తి సాయికుమార్ గంజాయి ఖాళీ స్థలంలో దాచిపెట్టి విక్రయిస్తున్నారు. మొదటి నిందితుడైన అడప రాకేష్ ఇంటర్మీడియట్ చదివే సమయంలోనే తన స్నేహితుల ద్వారా గంజాయి సేవించడం అలవాటు చేసుకున్నాడు. ఇంటర్ అనంతరం వారి ఆర్థిక పరిస్థితులు బాగోలేక చదువు మానివేసి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 2023 వ సంవత్సరంలో కోదాడ రూరల్ పోలీస్ వారు ఇతని వద్ద గంజాయి పట్టుబడి చేసి కేసు నమోదు చేసి జైలుకు పంపించగా జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత కొద్ది రోజులు గంజాయి సేవించడం మానివేసినాడు. గత 10 రోజుల క్రితం కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో వాయిదాకు హాజరుకావడానికి సూర్యాపేట కోర్టుకు వెళ్లగా అక్కడ కోర్టు వాయిదా గురించి ఒడిస్సా రాష్ట్రం నుండి వచ్చిన ఒక వ్యక్తి పరిచయమైనాడు. అతను కూడా గంజాయి కేసు వాయిదా గురించి వచ్చినాడని తెలుసుకున్న తర్వాత ఆడప రాజేష్ తనకు గంజాయి తాగటానికి, అమ్మటానికి కావాలని ఆతనిని అడగగా అతను జూన్-29 ఆదివారం రోజు ఒడిస్సా రాష్ట్రంలో కలిమెళ్ళలో శివ మందిర్ గుడి వద్దకు రమ్మని చెప్పినాడు. అతను చెప్పినట్లుగా తేదీ 28 తారీకున రాజేష్ ఒడిస్సా రాష్ట్రం లో అతను చెప్పిన అడ్రస్ కలిమెల శివ మందిర్ గుడి వద్దకు వెళ్ళి తేదీ. 29 వ తేదీన ఉదయం అతనిని కలిసి అతని వద్ద నుండి సుమారు 11 కేజి ల గంజాయి (6 ప్యాకెట్లు) ను రూ. 11000 రూపాయలకు కొఏర్పాటుచేసుకొని అక్కడినుండి ఎవరికి దొరకాకుండా వచ్చేందుకు లారీలలో మరియు బస్ లో తన మార్చుకుంటూ తేదీ 30 వ తారీఖున దొరకుంట గ్రామానికి వచ్చి గంజాయి తన ఇంట్లో పెడితే తన అమ్మ తిడుతుందని, పోలీసు వారు పట్టుకుంటారు అని అట్టి గంజాయిని దొరకుంట గ్రామ శివారులో గల ఇండస్ట్రియల్ ఏరియా కి వెళ్ళు దారిలో ఐచర్ ట్రాక్టర్ షోరూం వెనుక ఖాళీ స్థలంలో చెట్ల పొదల మధ్య దాచిపెట్టారు. తరచూ గంజాయి కొనుగోలు చేసే రెండవ నిందితుడైన వనపర్తి సాయి కుమార్ కు ఈనెల 2వ తారీఖున ఫోన్ చేసి గంజా తీసుకొని వచ్చిన విషయం చెప్పగా సాయికుమార్ నాలుగవ తారీకు మధ్యాహ్నం సమయములో రెండవ నిందితుడైన వనపర్తి సాయి కుమార్ మొదటి నిందితుడి వద్ద నుండి గంజాయి కొనుగోలు చేయడానికి రాగా వారిద్దరూ కలిసి గంజాయి దాచిన చోటుకు వెళ్ళి ఆడప రాకేష్ అట్టి గంజాయిలోనుండి సుమారు (01) కేజీ గంజాయిని వనపర్తి సాయి కుమార్ కు ఇవ్వగా అదే సమయంలో పోలీసు వారు వారిద్దరినీ పట్టుబడి చేసి మొదటి నిందితుడైన ఆడప రాకేష్ వద్ద నుండి (05) ప్యాకెట్ల గంజాయి మొత్తం బరువు (09) కేజీల (900) గ్రాములు, ఒక సెల్ ఫోన్ మరియు రెండవ నిందితుడైన వనపర్తి సాయి కుమార్ వద్ద నుండి (925) గ్రాముల గంజాయి, ఒక సెల్ ఫోన్ ను స్వాదీనం చేసుకున్నట్లుగా తెలిపారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లుగా ఎస్పీ తెలిపారు. ఇట్టి గంజాయి విలువ సుమారుగా రూ 2.80 లక్షలు వరకు ఉంటుంది. పైన తెలిపిన నేరస్తులను కోర్టు నందు హాజరు పరచమన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి..

మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రభుత్వం నుండి సృష్టమైన ఆదేశాలు ఉన్నాయి మన సమాజం నుండి డ్రగ్స్ ను డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి, దీనికోసం జిల్లా పోలీస్ శాఖ పటిష్టంగా పనిచేస్తుంది అన్నారు. గంజాయి రవాణా వినియోగము అమ్మకం లాంటి కేసుల్లో ఉన్న వారి అందరికీ కౌన్సిలింగ్ లు ఇస్తున్నాము అన్నారు. యువత దీని నుండి అప్రమత్తంగా ఉండాలి ఎవరైనా అలవాటు చేయాలని ప్రయత్నిస్తే అలాంటి వారి సమాచారాన్ని పోలీసులకు అందజేయాలి అని ఎస్పి కోరారు. గంజాయి సరఫరా, వినియోగం, రవాణా కు పాల్పడుతున్న వారి సమాచారం పోలీసు వారికి ఇవ్వాలి, ఇలాంటి వారిపై ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, షీట్స్ ఓపెన్ చేసి నిరంతర నిఘా ఉంచుతామ అని తెలిపారు..ఇట్టి స్పెషల్ టాస్క్ లో బాగా పని చేసిన సీఐ జి.రజితా రెడ్డి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్,కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్ రెడ్డి, సిసిఎస్ ఎస్ఐ హరికృష్ణ, సిసిఎస్ సిబ్బంది శ్రీనివాస్, కరుణాకర్, ఆనంద్, మల్లేష్, సతీష్, శివ కృష్ణ, ప్రభాకర్, మహిళా హోమ్ గార్డ్ మంజుల, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది జానీ, లక్ష్మయ్య లను, రూరల్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ లింగరాజు, కానిస్టేబుల్ ప్రవీణ్ లను ఎస్పీ అభినందించి రివార్డ్స్ అందించారు.

మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- అద్దె బస్సులు అందించిన మహిళా సంఘాలకు చెక్కులు
- ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భట్టి

హైదరాబాద్, జూలై5(నినాదం న్యూస్): అవకాశం ఉన్న ప్రతిచోట మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రభుత్వం మహిళా సంఘాలకు అండగా ఉంటుందని చెప్పారు. ప్రజాభవన్‌లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఆర్టీసీకి అద్దె బస్సులు అందించిన మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. తొలి నెల అద్దె కింద రూ.1.49 కోట్లు- ఆయా సంఘాలకు.. మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, సీతక్క అందించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళలు వ్యాపారవేత్తలుగా రాణించేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఐదేళ్లలో వారికి రూ.లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలనేది లక్ష్యమన్నారు. ఈ నెల 8న అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలపై చర్చించాలి. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న లబ్ధి గురించి చర్చించాలి. గ్రామాలు, మండలాల్లో మహిళా సమాఖ్య సమావేశాలు ఏర్పాటు- చేయాలి. ఈనెల 10 నుంచి 16 వరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు ఉంటాయి. వడ్డీ లేని రుణాల నగదును చెక్కుల రూపంలో అందిస్తాం. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంపై ప్రజలకు వివరించాలని భట్టి విక్రమార్క తెలిపారు.

పనివేళలను సవరించిన ప్రభుత్వం

హైదరాబాద్, జూలై5(నినాదం న్యూస్): వాణిజ్య కేంద్రాల్లో ఉద్యోగుల పని వేళల పరిమితిని తెలంగాణ ప్రభుత్వం సవరించింది. రోజుకు 10 గంటల వరకు పని చేసేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వారంలో పని వేళలు 48 గంటలు మించరాదని స్పష్టం చేసింది. పరిమితి దాటితే ఓటీ వేతనం చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రోజులో 6 గంటల్లో కనీసం అరగంట విశ్రాంతి ఇవ్వాలని, విశ్రాంతితో కలిపి 12 గంటల కంటే ఎక్కువ పని చేయించరాదని ఆదేశించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా పని వేళలు సవరించినట్లు ప్రభుత్వం వెల్లడిరచింది.

దుర్గాబాయ్ దేశముఖ్ మహిళాసభ

- ఒకేషనల్ కోర్సులకు దరఖాస్తులు

హైదరాబాద్, జూలై5(నినాదం న్యూస్): దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్ కేర్ మల్టీపర్పస్ వర్కర్ , ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ తదితర సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత పదవ తరగతి అని వివరించారు. రెస్పిరేటరీ థెరపీ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, రేడియోగ్రఫీ అసిస్టెంట్, క్యాథ్ ల్యాబ్ టెక్నీషియన్, పర్ఫ్యూజన్ టెక్నీషియన్ వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 15వ తేదీ ఆఖరు అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8309037134, 6805895867 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.